నమస్తే తెలంగాణ

# కరీంనగర్

5 కరీంనగర్, శనివారం 22 ఫిబ్రవరి 2025 KARIMNAGAR

# నష్టానికి బాధ్యత ఎవరిది?

- మిల్క్ కూలింగ్ సెంటర్ సీజ్ ఆది శ్రీనివాస్‌కు తెలిసే జరిగిందో లేదో చెప్పాలి
- రైతుల ఆందోళనలు చూసి ఎందుకు స్పందించలేదు • మీ కాంగ్రెస్ పార్టీ బద్నాం అవుతుందనే తెరిపించారు • బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ధ్వజం
- కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హితవు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ, ఫిబ్రవరి 21: 'మిల్క్ కూలింగ్ సెంటర్ సీజ్ చేయడంతో డెయిరీకి రూ. నాలుగు లక్షల వరకు నష్టం వాటిల్లింది. పాడి రైతులకు వేలాది రూపాయల నష్టం జరిగింది. దీనికి బాధ్యత మీదా..? కలెక్టర్‌దా..? ఎవరు బాధ్యత వహిస్తారో సమాధానం చెప్పాలి' అని విప్ ఆది శ్రీనివాస్‌ను బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు డిమాండ్ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇలా కక్షసాధింపు చర్యలు మానుకోవాలని, ప్రజలను ఇబ్బంది పెట్టకుండా మెరుగైన పాలన అందించాలని సూచించారు. ప్రభుత్వపరంగా ప్రజలకు మంచి పనులు చేస్తే తప్పకుండా తమ వంతు సహాయ సహకారం ఉంటుందని చెప్పారు. కానీ, ఇష్టం వచ్చినట్టు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ప్రజల పక్షాన ఎల్లప్పుడూ కొట్లాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. శుక్రవారం వేములవాడలోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మిల్క్ కూలింగ్ సెంటర్‌ను సీజ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అనంతరం చల్మెడ మాట్లాడారు. అగ్రహారం పాలశీతలీకరణ కేంద్రాన్ని సీజ్ చేయడం గమనిస్తే అధికార పార్టీ కనుసన్నల్లోనే అధికారులు పనిచేశారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. సీజ్ ఆది శ్రీనివాస్‌కు తెలిసి జరిగిందా? తెలియకుండా జరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక వేళ మీకు తెలిసి జరిగితే ఎందుకు అడ్డుకోలేదో చెప్పాలని, తెలియకుండా జరిగితే పొద్దంతా జరిగిన తతంగాన్ని చూశారే తప్పా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. రైతుల ధర్నాలు, రాస్తారోకోలు చేసిన విషయం తెలిసినా తెలియనట్టు వ్యవహరించిన మీ తీరును చూస్తే.. ఇదంతా మీ కనుసన్నల్లోనే జరిగినట్టు తాము భావిస్తున్నామని చెప్పారు. దీనిపై మీరేం వివరణ ఇస్తారని నిలదీశారు. గురువారం రైతులు ఆందోళనకు దిగడం, శుక్రవారం కలెక్టరేట్ ముట్టడికి నిర్ణయం తీసుకోవడం, ఈ విషయం బయటకు రావడంతో మీ పార్టీ బద్నాం అవుతుందని కూలింగ్ సెంటర్‌ను తెరిచారే తప్పు.. మీకు పాడి రైతులపై ప్రేమ ఉన్నట్టు కనిపించ లేదని విమర్శించారు. నిజంగానే ప్రేమ ఉంటే రైతులను ఇంత ఇబ్బంది పెట్టే వారు కాదన్నారు. కలెక్టర్ అనాలోచిత నిర్ణయం వల్ల లక్ష మంది పాడి రైతులు ఎంతో ఇబ్బంది పడ్డారని ఆవేదన చెందారు. పాడి పరిశ్రమ, మిల్క్ కూలింగ్ సెంటర్ అనేది, సహకార సంఘం అనేది ఏ ఒక్కరి ఆస్తి కాదని, అందరి ఉమ్మడి ఆస్తి అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. కలెక్టర్‌తో పాటు మిగతా అధికారులందరూ ఎవరి కనుసన్నల్లో పనిచేస్తున్నారో ప్రజలు గమనించాలని కోరారు. జిల్లాలో అసలు ప్రజాస్వామ్య వ్యవస్థ ఉన్నదా అని ప్రశ్నించారు. ఇప్పటివరకు జరిగిన టీ స్టాల్ మూసివేత, పాలకేంద్రం మూసివేత, ఆర్ఎంపీ క్లినిక్‌పై దాడులు కక్ష పూరితంగా జరిగినట్టు ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. జిల్లాలో జరుగుతున్న అన్ని రకాల చర్యలపై విప్ ఆది శ్రీనివాస్ స్పందించాలని డిమాండ్ చేశారు. రైతులతోపాటు ఏ వర్గానికి అన్యాయం చేసినా సహించే ప్రశ్నేలేదని స్పష్టం చేశారు. సమావేశంలో రుద్రంగి సెస్ డైరెక్టర్ ఆకుల గంగరాజం, నాయకులు రామతీర్థపు రాజు, మాల్యాల దేవయ్య, నిమ్మశెట్టి విజయ్, కొండ కనకయ్య, సిరిగిరి రామచంద్రం, నరాల శేఖర్, ముద్రకోళ వెంకటేశం, వెంగళ శ్రీకాంత్ గౌడ్, తంపుల సుమన్, మంతెన సంతోష్, గోపు పరశురాములు, పోతు అనిల్, పసుల ఆంజి, మంతె సందీప్, ఉమర్, లింగం రాకేశ్, అసద్ తదితరులు ఉన్నారు.

## కార్మికులకు నిరంతర ఉపాధి కల్పించాలి

- పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్




మాట్లాడుతున్న నాయకులు మూశం రమేశ్

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 21 : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను ప్రభు త్వం వెంటనే పరిష్కరించి, కార్మికులకు నిరంతర ఉపాధి కల్పించాలని పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సిరిసిల్లలోని బీవైనగర్ అమృత్ లాల్ శుక్లా కార్మిక భవన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. గత 15 నెలలుగా పవర్లూం వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభంతో పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది కార్మికులు వారి కుటుంబాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం సిరిసిల్ల పవర్లూం వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, కార్మికులకు నిరంతరం ఉపాధితో పా టు మెరుగైన వేతనాలు ఇప్పించాలన్నారు. అధికార పార్టీ, ప్రజా ప్రతినిధులు పరిశ్రమ అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, సీఐటీయూ నాయకులు అన్నల్‌దాస్ గణేశ్, సిరిమల్ల సత్యం, ఒగ్గు గణేశ్, జిందం కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల పడిగాపులు

తిమ్మాపూర్ రూరల్/ చిగురుమామిడి, ఫిబ్రవరి 21 : యూరియా కోసం రైతులు పొద్దంతా పడిగాపులు కాయాల్సి వస్తోంది. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్, చిగురుమామిడి మండలాల్లో యూరియా కోసం ప్రాథమిక సహకార సంఘాల వద్ద బారులు తీరి నిల్చుంటున్నారు. శుక్రవారం తిమ్మాపూర్ మండలం మల్లాపూర్ గ్రామంలోని పీఏసీఎస్‌కు 350 బస్తాల యూరియా లోడ్ రాగా, రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఒక్కొక్కరికి రెండు చొప్పున మాత్రమే ఇచ్చారు. దీంతో రెండు బస్తాలు ఎలా సరిపోతాయని అధికారులను నిలదీశారు. యూరియా వచ్చిన గంటకే బస్తాలు దొరకక పోవడంతో చాలా మంది రైతులు నిరాశతో వెనుదిరిగారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదని, నాట్లు వేసి నెలన్నర గడుస్తున్నా యూరియా వేయలేదని రైతులు వాపోయారు. సకాలంలో ఎరువులు లేకపోతే పంటలు ఎలా పండించాలని మండిపడ్డారు. చిగిరుమామిడి మండలకేంద్రంలోనూ యూరియా కోసం రైతులు పనులు వదులుకొని పొద్దంతా బారులు తీరి నిల్చున్నారు.




కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలో క్యూలో ఉన్న రైతులు

# యూరియా గండం

- ఉమ్మడి జిల్లాలో మొదలైన కష్టాలు
- కొరత లేదంటున్న అధికారులు
- డిమాండ్ మేరకు సరఫరా లేదంటున్న సొసైటీలు
- మార్క్‌ఫెడ్ నుంచి క్యాష్ అండ్ క్యారీ పద్ధతిలో సరఫరా
- మల్లగుల్లాలు పడుతున్న చిన్న సహకార సంఘాలు
- కరీంనగర్ జిల్లాలో ఉన్నది 1,200 మెట్రిక్ టన్నుల నిల్వలే
- మరో 5 వేల మెట్రిక్ టన్నులకు వారం కిందనే ఇండెంట్
- ఇప్పటి వరకు సరఫరా చేయని సర్కారు
- ఆందోళన చెందుతున్న రైతులు • సొసైటీల ఎదుట నిరసనలు




**ఉమ్మడి జిల్లాలో యూరియా కష్టాలు తీవ్రమవుతున్నాయి. ఎలాంటి కొరతా లేదని అధికారులు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం రైతులు ఇబ్బందులు పడుతున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి. సొసైటీలకు వచ్చిన కొద్ది సమయంలోనే నిల్వలు ఖాళీ అవుతున్నాయి. బారులు తీరుతున్నా చివరి రైతులకు అందడం లేదు. కాస్త ఆలస్యంగా వచ్చినా దొరకడం లేదు. ఈ పరిస్థితుల్లో సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయా.. లేవా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు క్యాష్ అండ్ క్యారీ పద్ధతిలో మార్క్‌ఫెడ్ ఎరువులు సరఫరా చేస్తుండగా, చిన్న సొసైటీలు పూర్తి స్థాయిలో ఎరువులు తెప్పించే పరిస్థితి లేదు. దీంతో ఆయా సొసైటీల పరిధిలో తిప్పలు తప్పడం లేదు. అయినా పట్టించుకునే వారు లేక రైతులు ఎక్కడికక్కడ నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో మళ్లీ కష్టాలు మొదలయ్యాయని మండిపడుతున్నారు. సకాలంలో పంటకు వేయకుంటే దిగుబడి మునిగే ప్రమాదముంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.**

కరీంనగర్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పాలనలో రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారు. నాట్లు వేసి రెండు నెలలైనా దొరక్క నిరీక్షిస్తున్నారు. సరిపడా నిల్వలు లేక రోజుల కొద్దీ గోదాముల చుట్టూ తిరుగుతూ పరేషాన్ అవుతున్నారు. ఎక్కడ చూసినా రైతులు ఇబ్బందులు పడుతున్న దృశ్యాలే కనిపిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. కరీంనగర్ జిల్లాలో చూస్తే.. సుమారు 42,416 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి ఇండెంట్ ఇచ్చారు. ఈ ఎరువులను 50 శాతం ప్రైవేట్ డీలర్లకు, మరో 50 శాతం మార్క్‌ఫెడ్‌కు సరఫరా చేస్తున్నారు. మార్క్‌ఫెడ్‌కు వచ్చే ఎరువులను జిల్లాలోని 30 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు, 42 డీసీఎమ్మెస్ సెంటర్లకు, మరో 18 ఆగ్రోసెంటర్లకు సరఫరా చేసి, అక్కడి నుంచి రైతులకు అందిస్తున్నారు. ఇప్పటి వరకు 39,386 మెట్రిక్ టన్నుల యూరియా రాగా, అందులో 50 శాతం కింద 19,693 మెట్రిక్ టన్నులను సొసైటీలు, డీసీఎమ్మెస్, ఆగ్రో సెంటర్లకు అందించారు. రైతులకు పంపిణీ కూడా చేస్తున్నారు. అధికారులు ఇచ్చిన ఇండెంట్ ప్రకారం ఇంకా 3,030 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉన్నది. ప్రస్తుతం జిల్లాలో మార్క్‌ఫెడ్, ప్రైవేట్ డీలర్ల వద్ద కలిపి కేవలం 1,200 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే ఉన్నట్లు తెలుస్తున్నది. దీంతో పాటు జిల్లాకు రావాల్సిన యూరియాను కలుపుకుంటే 4,230 మెట్రిక్ టన్నులే అవుతుంది. ఇంకా సీజన్ నడి మధ్యలోనే ఉన్నది. కనీసం మరో 5 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండే అవకాశమున్నది. ఈ మేరకు అధికారులు కూడా అదనంగా ఇండెంట్ ఇచ్చినట్టు తెలుస్తున్నది. జిల్లాకు ఇంకా రావాల్సిన యూరియాపోను మరో 2,500 మెట్రిక్ టన్నుల కోసం వారం పది రోజుల కిందనే ఇండెంట్ ఇచ్చినట్టు తెలుస్తుండగా, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. కనీసం జిల్లాకు రావాల్సిన యూరియానైనా ఇస్తారా.. లేదా? అనే సందేహం రైతుల్లో వ్యక్తమవుతున్నది.

### కొరతకు తోడు కొర్రీలు

యూరియా కొరతకు తోడు మార్క్‌ఫెడ్ నిబంధనలతో కొన్ని పీఏసీఎస్‌లకు తిప్పలు తప్పడం లేదు. పదేళ్ల నుంచి సహకార సంఘాలకు ఎరువుల సరఫరాకు బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చేది. దీంతో అవసరమైన ఎరువులను క్రెడిట్‌పై మార్క్‌ఫెడ్ సరఫరా చేసేది. ఇప్పుడా పరిస్థితి లేదు. క్యాష్ అండ్ క్యారీ పద్ధతిలో ఎరువులు ఇస్తుండగా, ఆర్థిక వనరులు లేని సంఘాలు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఏ సహకార సంఘం, డీసీఎమ్మెస్, ఆగ్రో సెంటర్ల పరిధిలో ఎంత యూరియా అవసరం ఉంటుందనేది వ్యవసాయ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి ఇప్పటి వరకు సరఫరా, ఇంకా ఎంత అవసరం? అనేది దృష్టిలో పెట్టుకొని మార్క్‌ఫెడ్‌కు సూచిస్తున్నారు. ఆ మేరకు ఆయా సంఘాలకు యూరియా సరఫరా అవుతున్నది. కానీ, క్యాష్ అండ్ క్యారీ విధానంతో కొన్ని సంఘాలు ఆర్థిక వనరులు సరిగ్గా లేక సకాలంలో డీడీలు తీయడం లేదని తెలుస్తున్నది. సరిపడా ఎరువులు కూడా తెచ్చి రైతులకు ఇవ్వలేని దుస్థితి ఉన్నది. ఇదే విషయమై కొందరు సీఈవోలతో మాట్లాడితే, తమ సంఘాలకు పరిపుష్టిగా ఆర్థిక వనరులు ఉన్నాయని, యూరియా కోసం అడ్వాన్స్‌గా డీడీలు తీసి మార్క్‌ఫెడ్‌కు పంపిస్తున్నామని, కొరత కారణంగానే తమకు సకాలంలో యూరియా సరఫరా చేయడం లేదని స్పష్టం చేస్తున్నారు.

### ఆందోళనలో రైతన్నలు

పరిస్థితులు ఏవైనా వారం పది రోజుల నుంచి యూరియా కొరత ఏర్పడినట్టు స్పష్టంగా తెలుస్తున్నది. ఈ పరిస్థితి ఇలాగే ఉంటే తమ పరిస్థితి ఏంటనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతున్నది. జిల్లాలో ఇప్పటికే 38వేల మెట్రిక్ టన్నులకుపైగా యూ రియా వినియోగించారని, మరో 5వేల మెట్రిక్ టన్నులైనా అవసరం ఉంటుందని అంచనా ఉంది. కానీ, సహకార సంఘాలకు ఎరువులు వస్తున్నట్టు తెలిసిన వెంటనే రైతులు బారులు తీరుతున్నారు. వచ్చిన ఎరువులు ఎవరికో కొందరికి మాత్రమే అందుతుండగా, ఆగ్రహిస్తున్నారు. కాస్త వెనకైన రైతులకు ఒక్క బస్తా కూడా దొరకని పరిస్థితి ఉండగా, కొందరు అవసరానికి మించి కొ నుగోలు చేస్తున్నారని మండిపడుతున్నారు. ఏ రైతుకు ఎంత అవసరం ఉంటే అన్నే యూరియా బస్తాలు ఇవ్వాలని వారు కోరుతున్నారు. ఇప్పటికే కరీంనగర్ రూరల్, తి మ్మాపూర్, మానకొండూర్, సైదాపూర్ తదితర మండలాల్లో నిరసన వ్యక్తం చేశారు. యూరియా కోసం ఇవే పరిస్థితులు ఇలాగే కొనసాగితే, కీలక దశలో ఉన్న వరికి సకాలంలో అందించకపోతే దిగుబడిపై ప్రభావం చూపుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి అధికారులు ఇచ్చిన ఇండెంట్ మేరకు యూరియా సరఫరా చేయాలని కోరుతున్నారు.

## ఎన్టీపీసీ యాష్ ఉచితం ఉత్తదే..

# లోడింగ్ పేరిట దందా?

- ఒక్కో లారీకి ₹4 వేలకుపైనే వసూలు
- రోజుకు ₹30 లక్షల దాకా?
- నాయకులు, అధికారులపై ఆరోపణలు
- ప్రైవేట్‌కు అప్పజెప్పడంపై విమర్శలు

**ఎన్టీపీసీ బూడిద కొంత మందికి కాసుల వర్షం కురిపిస్తున్నది. సమీప గ్రామాల ప్రజలు నిరంతరం కాలుష్యంతో సతమతమవుతుంటే.. ఇక్కడ మాత్రం లక్షల రూపాయల దందా నడుస్తున్నట్టు తెలుస్తున్నది. అందులో నాయకులు, అధికారులకు వాటాలు, ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.**



బూడిద లోడింగ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్

పెద్దపల్లి, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): బొగ్గు ఆధారిత ప్రాజెక్టు అయిన ఎన్టీపీసీలో బొగ్గును మండించిన తర్వాత బూడిద వస్తుంది. ప్రతి రోజూ దాదాపుగా 11 వేల టన్నుల బూడిద రామగుండం మండలం మల్యాలపల్లి చెరువులోకి వచ్చి చేరుతుంది. ఈ బూడిదను జాతీయ రహదారుల నిర్మాణం, ఇటుకల తయారీతోపాటు ఇతర నిర్మాణాలకు ఉచితంగా ఇవ్వడానికి ఎన్టీపీసీ నిర్ణయించింది. అందులో భాగంగా బూడిద రవాణాకు టెండర్లను పిలువగా.. గతేడాది ₹38 టన్ను ఉండేది. ఆ తర్వాత ₹138కు టన్ను చొప్పున తీసుకునేందుకు 38 మంది టెండర్లు దాఖలు చేసి టెండరు దక్కించుకున్నారు. ఒక్కొక్కరు ₹5 లక్షల నుంచి ₹15 లక్షల వరకు డిపాజిట్ సైతం చేశారు. వీరి నుంచి ఈఎండీ కట్టించి సెక్యూరిటీ డిపాజిట్ తీసుకున్నారు. వారు దాదాపుగా ₹3 కోట్ల నుంచి ₹4 కోట్ల వరకు ఖర్చు చేశారు. యాష్ పాండ్‌లో వాళ్లు రోడ్లు నిర్మించుకున్న తర్వాత స్థానికంగా కొందరు ఆటంకాలను కల్పించి బూడిద వెలికితీతను నిలిపివేయించారు. తర్వాత అధికారులు టెండర్లను రద్దు చేస్తామని ప్రకటించి హోల్డ్‌లో పెట్టారు. ఎన్టీపీసీ తిరిగి ₹1కే టన్నుగా టెండర్లను పిలువగా, 114మంది ఈ టెండర్లను దాఖలు చేసి దక్కించుకున్నారు. ఇక్కడే అసలు కథ మొదలైంది. కొందరు స్థానిక నాయకులు అందులోకి చొరబడి, లోడింగ్ దగ్గర తిరకాసు పెట్టినట్టు తెలిసింది. వాస్తవంగా అయితే, లోడింగ్ ఎన్టీపీసీ అయినా చేయాలి లేదా టెండరు దక్కించుకున్నవాళ్లు ఎవరికి వారు జేసీబీలు పెట్టుకొని చేసుకోవాలి. కానీ, ఇక్కడ రాజకీయ జోక్యంతో ఓ ఐదుగురు వ్యక్తులు చక్రం తిప్పి ఐదు లోడింగ్ మిషన్ల (జేసీబీలు)కు మాత్రమే అనుమతులు తెచ్చుకున్నట్టు తెలిసింది. నిజానికి ఒక్కో లారీ లోడింగ్ చార్జి ₹700 నుంచి ₹వెయ్యి వరకు అవుతుంది. కానీ, ఇక్కడే దందాకు తెర తీసి, భారీగా వసూళ్లకు దిగారనే విమర్శలున్నాయి. ఒక్కో లారీకి ₹4,600 నుంచి ₹9,600 వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రతి రోజూ దాదాపు వెయ్యి వాహనాల్లో బూడిదను తరలిస్తుండగా, రోజుకు ₹30 లక్షల వరకు వసూలు చేస్తున్నట్టు తెలిసింది. అందులో పెద్దలకూ వాటాలు వెళ్తున్నాయని, ఈ విషయంలో ఉన్నతాధికారులు సైతం మౌనం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అసలు ఎన్టీపీసీనే లోడింగ్ చేపడితే కేవలం ₹వెయ్యికే అవుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి.



బూడిద చెరువు సమీపంలోని అటవీ ప్రాంతంలో వసూళ్ల కోసం టేబుల్, కుర్చీలు వేసుకొన్న ప్రైవేటు వ్యక్తులు



మల్యాలపల్లి చెరువుకు లోడింగ్ కోసం వచ్చిన లారీలు

### వసూళ్లు ఇలా..

ఎన్టీపీసీ బూడిద విషయంలో దళారులు పెద్ద ఎత్తున వసూళ్లకు దిగుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల పేరు చెప్పి దందాకు తెరలేపినట్టు తెలుస్తున్నది. బసంత్‌నగర్–రామగుండం మధ్య ఉన్న మల్యాలపల్లి గేటు వద్ద బహిరంగంగా చెట్లల్లో టేబుల్ వేసుకొని ఒక కంపెనీ పేరిట ₹500 చొప్పున డబ్బులు కట్టించుకొని వే బిల్లులు ఇస్తున్నట్టు తెలిసింది. మరో రెండు కిలో మీటర్ల దూరం వెళ్లిన తర్వాత ఒక కంటైనర్ పెట్టుకొని, రాత్రయితే అదే కంటైనర్‌లో టేబుల్ కుర్చీలు వేసుకొని వసూలు చేయడం, పగలైతే అటవీ ప్రాంతంలో టేబుల్, కుర్చీలు వేసుకొని డబ్బులు బాజాప్తా వసూలు చేస్తున్నారనే సమాచారం అందుతున్నది.

### ఏ లారీకి ఎంతంటే!

బూడిదను లారీల్లో లోడ్ చేయాలంటే ఇక్కడ ఒక్కో లారీకి ఒక్కో ధరను నిర్ణయించారు. కేవలం ₹వెయ్యిలోపే అయ్యే ఖర్చును ₹4,600 నుంచి ₹9,600 వరకు వసూలు చేస్తున్నారు. 12 టైర్ల వాహనంలో 22 టన్నులు నింపాలి. కానీ, ఇక్కడ ₹4600 వసూలు చేసి 25 నుంచి 27 టన్నులు నింపుతున్నారు. అలాగే, 14 టైర్ల వాహనంలో 32 టన్నులు నింపాల్సి ఉండగా, ₹6100 తీసుకొని 40 టన్నులు నింపుతున్నారు. 16 టైర్ల వాహనంలో 35 టన్నులు నింపాల్సి ఉండగా, ₹9600 వసూలు చేసి 47 టన్నులు లోడ్ చేస్తున్నారు.

### ఎన్టీపీసీనే లోడింగ్ చేయాలి

అక్రమాలకు ఆస్కారం లేకుండా లోడింగ్ చేయాలి. ఎన్టీపీసీ లోడింగ్‌ను సైతం చేపట్టాలి. సాధారణంగా లోడింగ్‌కు ₹700 నుంచి ₹1200 లోపు అవుతుంది. అలా డబ్బులు తీసుకొని చేసినా ప్రయోజనమే. కానీ, ఇలా దళారులను మేపే విధంగా ఎన్టీపీసీ యాజమాన్యం వ్యవహరించడం అన్యాయం. లారీ ఓనర్లు, డ్రైవర్ల కడుపు కొడుతున్నారు. ₹4600 నుంచి ₹9600 వరకూ వసూళ్లు చేస్తున్నారు. ఓవర్‌లోడ్ లేకుండా రవాణాను సైతం స్థానిక లారీలకే అవకాశం ఇవ్వాలి. లైన్ బండ్లకు అవకాశం ఇవ్వడం వల్ల స్థానిక లారీ ఓనర్లు నష్టపోతున్నారు. అక్రమ వసూళ్లను అడ్డుకోవాలి. ఈ అవినీతిలో అందరికీ పాత్ర ఉంది. స్థానిక ప్రజాప్రతినిధి నుంచి మంత్రులకు సంబంధాలు ఉన్నాయి. వీటన్నింటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.

**-కౌశిక్‌హరి, ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు రామగుండం**

## వాగులోకి నీళ్లు వదిలి

# పంటలు కాపాడండి

- ముస్తాబాద్‌లో రైతుల ధర్నా



ముస్తాబాద్‌లో ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న పలు గ్రామాల రైతులు

ముస్తాబాద్, ఫిబ్రవరి 21 : మల్లన్నసాగర్ నుంచి ముస్తాబాద్ పెద్ద చెరువుకు వస్తున్న నీరు మరో మూడు ఫీట్లు పెరిగిన తర్వాత దిగువన ఉన్న నక్కవాగుకు వదిలి పంటలను కాపాడాలని పలు గ్రామాల రైతులు శుక్రవారం మండలకేంద్రంలో ఎండలో ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. నక్కవాగు పరిసర గ్రామాలైన పోతుగల్, గన్నెవానిపల్లె, నర్సింహులతండా, మామిండ్లవారిపల్లె, నిమ్మలవారిపల్లె, తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేట గ్రామాల రైతులు తాము వేసిన వరి పంట నీరు లేక వాడిపోతున్నదని, పొలం పగుళ్లు చూపుతున్నాయని, వెంటనే నీరందించకుంటే పశువుల మేతకు వదలాల్సి వస్తుందని వారం రోజుల నుంచి అధికారులకు విన్నవిస్తూ వస్తున్నారు. దీనిపై నీటి పారుదల శాఖ అధికారులు శుక్రవారం ముస్తాద్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో ముస్తాబాద్, పోతుగల్, పరిసర గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. ఇందులో ముస్తాబాద్‌కు చెందిన నాయకులు, రైతులు మల్లన్నసాగర్ నుంచి ముస్తాబాద్ పెద్ద చెరువుకు వస్తున్న నీరు మరో మూడు ఫీట్లు పెరిగిన తర్వాత దిగువకు వదలాలని పట్టుబట్టడంతో అధికారులు సమావేశం నుంచి వెళ్లిపోయారు. దీంతో ఆగ్రహించిన రైతులు సిద్దిపేట– కామారెడ్డి ప్రధాన రహదారిపైకి వచ్చి అధికారుల తీరును నిరసిస్తూ బైఠాయించారు. దీంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో స్థానిక తహసీల్దార్ సురేశ్ కుమార్ అక్కడికి రాగా, మల్లన్నసాగర్ నుంచి వచ్చే నీటిని దిగువకు వదిలి పంటలను కాపాడాలని రైతులు వేడుకున్నారు. దీనిపై తహసీల్దార్ నీటి పారుదలశాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. మల్లన్నసాగర్ అధికారులతో మాట్లాడి ముస్తాబాద్ పెద్ద చెరువులోకి మూడు రోజుల్లో ఎక్కువ నీరు వచ్చేలా చూస్తామని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. నీరు ఆలస్యమైతే పంటలు చేతికందవని, త్వరగా వచ్చేలా చూడాలని ఈ సందర్భంగా రైతులు వేడుకున్నారు.